క్లుప్తంగా

దరఖాస్తుదారులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి



సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం 16వ వార్డు బుధవారపేట సచివాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలన్నారు. పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇచ్చి రూ.5 లక్షలతో ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, బీసన్న, చాముండేశ్వరి, శ్రీరాములు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్ప ఇళ్లకు మరమ్మతులు చేయాలి



సంతకాల సేకరణ చేస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు: పెద్దపాడు సమీపంలో పేదల కోసం నిర్మించిన రాజీవ్ గృహకల్ప సముదాయానికి మరమ్మతులు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ నగర సమితి ఆధ్వర్యంలో రాజీవ్ గృహకల్ప ఇళ్లను పరిశీలించారు. చాలా గృహాలు పెచ్చులూడి దెబ్బతిని ఉన్నాయని తెలిపారు. భవనం కూలకముందే మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీనివాస రావు, రామాంజి, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్ కుమార్, నాయకులు పద్మావతి, చంద్ర, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ వాయిదా వేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

కర్నూలు(సెంట్రల్): గ్రూపు-2 నోటిఫికేషన్‌లో రోస్టర్ పాయింట్లను సవరించిన తరువాతే మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వేలాది మంది గ్రూపు-2 అభ్యర్థులు పరీక్షలను తాత్కాలికంగా వాయిదా వేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకెళ్తోందన్నారు. రోస్టర్ పాయింట్లను సవరించకపోతే భవిష్యత్‌లో కోర్టు కేసులతో నోటిఫికేషన్ మొత్తం రద్దయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బీసన్న, చంటి, అఖిల్ పాల్గొన్నారు.

రాధాకృష్ణకు బ్రహ్మకుమారీస్‌తో సంబంధం లేదు

కర్నూలు (సెంట్రల్): బ్రహ్మ కుమారీస్ ఓర్వకల్లు శాఖ అధ్యక్షుడిగా పనిచేసిన మైలా రాధాకృష్ణను తొలగించామని, ప్రస్తుతం ఆయనతో తమ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని బ్రహ్మ కుమారీస్ కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ మీరా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాధాకృష్ణ ఏమైనా కార్యక్రమాలు నిర్వహించుకుంటే ఆయన వ్యక్తిగతమని చెప్పారు.

పిల్లల మనసు గెలుచుకోవాలి



పిల్లల పుట్టినరోజు వేడుకల నిర్వహణను డెమో ద్వారా వివరిస్తున్న డీఈఓ

కల్లూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రానికి వచ్చే పిల్లల మనసు గెలుచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) శామ్యూల్ పాల్ చెప్పారు. కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని శనివారం డీఈఓ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను ఎలా రప్పించుకోవాలో వివరించారు. కేంద్రాల్లో ప్రతి కార్యకర్త పిల్లలతో కలిసి ఇంటి వాతావరణం సృష్టించాలన్నారు. కేంద్రంలో పిల్లల పుట్టిన రోజు వేడుకలను ఎలా జరపాలో డేమో ద్వారా వివరించారు. ఎంఈఓలు శ్రీనివాసులు, వనజకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపు

కర్నూలు న్యూసిటీ: సెలవు దినం అయినప్పటికీ ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు కేంద్రాలు కేంద్రాలు తెరిచి ఉంటాయని ఎస్ఈ ఉమాపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఆందోళన

కర్నూలు(సెంట్రల్): సివిల్ సప్లై గోదాముల్లో పని చేసే హమాలీలకు పెంచిన కూలి రేట్లు అమలు చేయాలని సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం కర్నూలులోని ఎంఎల్ఎస్ పాయింట్ దగ్గర హమాలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్ సప్లై హమాలీలకు ఇచ్చే కూలిని రూ.25 నుంచి రూ.28కు పెంచినట్లు సర్కారు ప్రకటించినా అమలు చేయడం లేదన్నారు. అలాగే రెండు జతల దుస్తులతోపాటు బోనస్ ఇవ్వాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. వీటిపై ప్రభుత్వం స్పందించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పీఎస్ రాధాకృష్ణ, రాజు. శివ, వినయ్, ప్రకాష్, రమేష్, శీను, ఎంరాజు, వెంకటేష్, బాలరాజు, మహేంద్ర, సూరి, మద్దిలేటి, సుధాకర్, దేవరాజు పాల్గొన్నారు.



పెంచిన కూలి రేట్ల కోసం సివిల్ సప్లై గోదాము దగ్గర ధర్నా చేస్తున్న హమాలీలు

అవగాహన



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు(సెంట్రల్): ప్రజలకు అనువుగా ఉండేలా జనన, మరణ, ఆదాయ, కుల, వివాహ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి రెవెన్యూ, మునిసిపల్ అధికారులకు సూచించారు. శనివారం జిల్లా న్యాయ సేవా సదన్‌లో రెవెన్యూ, మునిసిపల్ అధికారులతో ఆయా ధ్రువీకరణ పత్రాల జారీపై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ..హిందూ మ్యారేజ్ యాక్ట్ 1955, స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ 1945 ప్రకారం వివాహ ధ్రువీకరణపత్రాలు జారీ చేయాలన్నారు. కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్ మాట్లాడుతూ.. కుల ధ్రువీకరణ పత్రాన్ని 15 రోజుల్లో ఇస్తామన్నారు. ఆదాయ ధ్రువీకరణ పత్రాలు గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లో 12 వేల లోపు ఆదాయం ఉంటే జారీ చేస్తున్నట్లు కోడుమూరు తహసీల్దార్ వెంకటేష్ నాయక్ వెల్లడించారు.

ఆవేదన

కర్నూలు (టౌన్) : 42 ప్రభుత్వ యాప్‌లతో ఉద్యోగులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని ఏపీ జేఏసీ చైర్మన్ వెంగల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ కార్యదర్శులకు సంబంధించిన విధులు కాకుండా ఇతర పనులు అప్పగించడం సరికాదన్నారు. శనివారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉద్యోగుల సంఘం నాయకులు కమిషనర్ రవీంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన మెడికల్ రీయింబర్స్ మెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం కార్యదర్శి కృష్ణుడు, నగర అధ్యక్షుడు కాశన్న, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షుడు చందన, మెడికల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ ఈశ్వరయ్య, మునీర్ అహమ్మద్, మద్దయ్య పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీ జెఏసీ చైర్మన్ వెంగళరెడ్డి, ఉద్యోగులు

ఆదర్శనీయులు అబుల్ కలాం ఆజాద్



ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా విశిష్ట సేవలు అందించిన డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆదర్శనీయులని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సయ్యద్ సబీహా పర్వీన్ అన్నారు. శనివారం అబుల్ కలాం ఆజాద్ 67వ వర్ధంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో అబుల్ కలాం ఆజాద్ ఎంతో ముఖ్యమైన పాత్ర పోషించారన్నారు. ఆయనకు అరబిక్, ఇంగ్లిషు, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలీ భాషల్లో ప్రావీణ్యం ఉందన్నారు. కేంద్రంలో 11 సంవత్సరాలు విద్యాశాఖ మంత్రిగా పనిచేశారన్నారు. ఆయన ఉర్దులో అల్ హిలాల్ అనే వార పత్రికను ప్రారంభించారన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమం, వక్ఫ్ బోర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

దేశ ప్రగతికి కేంద్ర బడ్జెట్ దోహదం

కర్నూలు (సెంట్రల్) : ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రగతికి ఎంతో దోహదం చేస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కర్నూలులోని ఓ ప్రైవేటు హోటల్‌లో కేంద్ర బడ్జెట్‌పై మేధావుల సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు, విద్యార్థులు పాల్గొని కేంద్ర బడ్జెట్‌పై విస్తృత చర్చ జరిపారు. వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక వృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరింత సహాయం చేస్తుందని ప్రకటించారు.

ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలి

కర్నూలు కల్చరల్: ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆ యూనియన్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలైనా ఒక్క ఆర్థిక ప్రయోజనం కూడా కల్పించకపోవడం దారుణమన్నారు. కేవలం బదిలీలు, పదోన్నతుల చట్టం బూచితో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. నూతన పీఆర్‌సీ జాప్యాన్ని నివారించుటకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ, అరియర్స్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు రావాల్సిన బెనిఫిట్స్ చెల్లించాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ వర్తింప చేయాలని, 1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవిప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్ బాబూరావు, ఆదినారాయణరెడ్డి, మనికుమార్‌రెడ్డి, నాగేశ్వరయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్‌వీ కృష్ణారెడ్డి

జాతీయ సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్, తదితరులు

కర్నూలు కల్చరల్: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్లను శనివారం వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సహకారంతో ×గ్రామీణ సమాజ సాధికారత ఉపాధి అవకాశాలు, పరివర్తన వ్యూహాలు¥ అంశంపై ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జి.ఎల్లకృష్ణ నిర్వహిస్తున్నారన్నారు. పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్య కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ ప్రసాద్ రెడ్డి, వర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ నాగరాజు శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు సమయానుసారంగా టీకాలు ఇవ్వాలి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, పిల్లలకు సమయానుసారంగా టీకాలు ఇప్పించాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి చెప్పారు. శనివారం స్టాంటన్ పురంలోని యూపీహెచ్‌సీ పరిధిలోని కొండారెడ్డినగర్ 101 సచివాలయంలో జరుగుతున్న టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు ప్రాణాంతక వ్యాధులు రాకుండా రక్షణ కల్పిస్తాయని చెప్పారు. కాబట్టి తల్లులు తమ పిల్లలకు టీకాలు వంద శాతం ఇప్పించాలని తెలిపారు. మీజిల్స్ రుబెల్లా ఎలిమినేషన్ కార్యక్రమంలో భాగంగా మీజిల్స్ రుబెల్లా (ఎంఆర్) వ్యాక్సిన్‌ను బిడ్డకు 9, 16 నెలల వయస్సులో తప్పకుండా వేయించాలని సూచించారు. గర్భిణి ఐరన్, కాల్షియం కలిగిన ఆహార పదార్థాలను విరివిగా తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురిగాకుండా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు భూషమ్మ, ఆశా కార్యకర్త రాజేశ్వరి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

బీజేపీ విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కర్నూల(సెంట్రల్): బీజేపీ మతోన్మాద విధానాలపై కార్మిక వర్గాలు పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన ఆయూనియన్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ సమాజాన్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మైనార్టీలపై దాడులు జరుగుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని చెప్పారు. మైనార్టీల ఆస్తులను కాజేసేందుకు వక్ఫ్ చట్టం సవరణ కోసం పట్టు బట్టారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్లను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. రాష్ట్రంలో కనీస వేతన చట్టం అమలు చేయకుండా కార్మికుల కడుపు కొడుతున్న చంద్రబాబు ప్రభుత్వంపై తిరగబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, నాయకులు బి.రామాంజనేయులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని మెడికవర్, సీఎస్ హాస్పిటల్‌లోని అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలను శనివారం జిల్లా సంచార చికిత్స కార్యక్రమం నోడల్ అధికారి డాక్టర్ రఘు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్‌కు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. అనంతరం స్కానింగ్ సెంటర్లలో మిషన్ల రిజిస్టర్ నమోదు, వాటి వరుస సంఖ్య, తయారీ కంపెనీ పేర్లను సరిపోల్చి చూశారు. స్కానింగ్ చేయించుకున్న గర్భిణుల నమోదు రిజిస్టర్‌ను పరిశీలించారు. అలాగే గర్భిణిల నుంచి పూర్తి సమాచారం తీసుకుని ఫామ్ ఎఫ్‌లో సంతకం, వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఫారమ్ ఎఫ్ తప్పకుండా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షల నిషేధ చట్టానికి సంబంధించిన పోస్టర్లను రిసెప్షన్‌లో, స్కాన్ మిషన్ ఉన్న రూములో ప్రదర్శించాలని చెప్పారు.



స్కానింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ రఘు

సర్వేల్లో వేగం పెంచండి

- గూగుల్ మీట్‌లో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ/ వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో జరుగుతున్న మిస్సింగ్ సిటిజన్, హౌస్ ఇమేజ్ క్యాప్చరింగ్, జీయో కోఆర్డినేట్స్, ఎన్‌పీసీఐ యాక్షన్ టేకెన్, ఈకేవైసీ తదితర సర్వేల్లో వేగం పెంచాలని జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన జెడ్పీలోని తన చాంబర్ నుంచి జిల్లాలోని ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు, ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్‌వైజర్లతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయంలోగా సర్వేలను పూర్తిచేసి రాష్ట్రంలోనే జిల్లాను ముందు వరుసలో నిలపాలన్నారు. ఈ నేపథ్యంలోనే 0 నుంచి 6 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లల ఆధార్‌కార్డుల జనరేషన్‌కు సంబంధించి సీడీపీఓ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో సమన్వయం చేసుకొని ఆధార్ లేని పిల్లలకు త్వరితగతిన ఆధార్‌కార్డులు వచ్చేలా చూడాలన్నారు. ఆధార్ వెరిఫికేషన్‌ను కూడా ఎంపీడీఓలు త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామ/ వార్డు సచివాలయ సిబ్బంది రోజు వారీ హాజరు తప్పకుండా వేయాలని, లేని పక్షంలో షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. ఎస్‌బీఎం పనితీరును కూడా మెరుగుపరిచి ఆయా గ్రామాలను మోడల్‌గా తీర్చిదిద్దాలన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి ప్రాధాన్యం

కర్నూలు (టౌన్): క్రీడాకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో 10 వ రాష్ట్ర స్థాయి సీనియర్స్ మహిళలు, జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు సర్కారు ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. సీఐడీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నగేష్ మాట్లాడుతూ ప్రతి రోజు కొంత సమయం క్రీడా సాధనకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం సీఈఓ విజయ్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు, రాయలసీమ యూనివర్సిటీ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శివ కిషోర్, హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి, సీనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు మాధవరావు పాల్గొన్నారు.

బోదకాలు వ్యాధిని నిర్మూలిద్దాం

కర్నూలు(రూరల్): ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించి కలిసికట్టుగా బోదకాలు వ్యాధిని నిర్మూలిద్దామని డీఎంఓ నూకరాజు పిలుపునిచ్చారు. శనివారం గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోదకాలు బాధితులు ఏడుగురికి ఉచిత కిట్లతో పాటు మందులను పంపిణీ చేశారు. ఆయన మాట్లడుతూ క్యూలెక్స్ దోమ కుట్టడం వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. ఇంటి పరిసరాల్లో ఉన్న మురుగునీటిలో ఈ దోమ గుడ్లు పెట్టి వృద్ధి చెందుతుందని చెప్పారు. ఇది ఒకరి నుంచి మరోకరికి వ్యాప్తి చేందుతుంది తెలిపారు. ఈ వ్యాధి సంక్రమించకుండా సంవత్సరానికి ఒక మోతదు డీఈసీ మరియు అల్‌బెండజోల్ మాత్రాలు వేసుకోవాలని సూచించారు.

పకడ్బందీగా ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

- అధికారులకు డీఆర్‌ఓ వెంకట నారాయణమ్మ ఆదేశం

కర్నూలు కల్చరల్: మార్చి 1 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌ఓ సి. వెంకట నారాయణమ్మ ఆదేశించారు. శనివారం టౌన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, కస్టోడియన్లతో అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ అందరూ బాధ్యతా యుతంగా పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు సమకూర్చాలన్నారు. మాల్ ప్రాక్టీస్‌ను పూర్తిగా నిరోధించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్ఐఓ ఎస్‌వీఎస్ గురవయ్య శెట్టి మాట్లాడుతూ పరీక్షలు సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత సీఎస్, డీఓలపై ఉందన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పరీక్ష విధుల్లో ఉన్న అధికారులు నిర్లక్ష్యం వహిస్తే వారిపై బోర్డు ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయన్నారు. ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రబోస్, స్పెషల్ ఆఫీసర్ లాలెప్ప, టౌన్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న, డీఈసీ మెంబర్స్ పద్మావతి, సురేష్ చంద్ర, డిస్ట్రిక్ట్ బల్క్ ఆఫీసర్ రమాదేవి, జేఎల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మురళి, తదితరులు పాల్గొని మాట్లాడారు.



డీఆర్‌ఓకు వెంకట నారాయణమ్మకు బొకే అందజేస్తున్న ఆర్ఐఓ ఎస్‌వీఎస్ గురవయ్య శెట్టి

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

కర్నూలు (టౌన్) : నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. శనివారం స్థానిక బి.క్యాంపు, శరీన్‌నగర్, రాఘవేంద్ర నగర్‌లలో రహదారులు, మురుగు కాల్వల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పనుల్లో నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. క్యూరింగ్ పూర్తి అయిన తరువాతనే పనులకు సంబంధించిన బిల్లులు పెట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ ఈ రాజశేఖర్, డీఈఈ గిరిరాజు, మనోహర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏఈ భాను ప్రతాప్ పాల్గొన్నారు.

'మహా'భిమానం

ఆస్పరి: కొత్త ఇంటిపై దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫొటోలు వేయించి అభిమానం చాటుకున్నాడు బిల్లేకల్లుకు చెందిన ఓ అభిమాని. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొందిమడుగుల పెద్దయ్య ఇటీవల కొత్తగా ఇంటిని నిర్మించుకున్నారు. వైఎస్సార్ కుటుంబంపై ఉన్న అభిమానంతో వారి ఫొటోలను ఇంటి ముందు భాగంలో వేయించి వైఎస్ ఆర్ అని పేరు కూడా పెట్టుకున్నారు. ఆదివారం గృహ ప్రవేశం చేయనున్నట్లు పెద్దయ్య తెలిపారు. ఆర్ అండ్‌బీ రోడ్డుకు సమీపంలోనే ఇల్లు ఉండటంతో దారిన వచ్చిపోయే వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



బొందిమడుగుల పెద్దయ్య



ఇంటికి వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలు వేయించిన దృశ్యం

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ఘన నివాళి



నరసింహారెడ్డికి నివాళులర్పిస్తున్న జెడ్పీ ఉద్యోగులు

కర్నూలు(అర్బన్): బ్రిటీష్ వారి గుండెల్లో సింహస్వప్నంగా నిలిచిన స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులు ఘనంగా నివాళి అర్పించారు. శనివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతి సందర్భంగా జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో ఆయన చిత్ర పటానికి సీఈఓ నాసరరెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన నరసింహారెడ్డి బ్రిటీష్ పాలనకు ఎదురొడ్డి పోరాటం చేశారన్నారు. కుల మతాలకు అతీతంగా పాలన సాగించారని గుర్తు చేశారు. కర్నూలు, అనంతపురం, కడప, బళ్లారి జిల్లాల్లోని 66 గ్రామాలకు ఆయన అధిపతిగా పరిపాలన సాగించారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ పరిపాలనాధికారులు సరస్వతమ్మ, నాగేంద్రప్రసాద్, బసవశేఖర్, పుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ కృష్ణ సేవలు చిరస్మరణీయం

కర్నూలు కల్చరల్ : రంగస్థల కళారంగంలో బీసీ కృష్ణ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు, కళాకారులు కొనియాడారు. కర్నూలు జిల్లా రంగస్థలాం కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం మద్దూర్ నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో బీసీ కృష్ణ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గుర్రపుసాల అంకయ్య మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో బిల్వమంగళ పాత్రలో బి.సి.కృష్ణ అలరించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రదర్శనలిచ్చి గుర్తింపు పొందారన్నారు. కళామతల్లి ముద్దుబిడ్డగా ఎన్‌టీఆర్ అవార్డు అందుకున్న ఏకైక రంగస్థలం నటుడు ఈయన అన్నారు. అంతకుముందు బీసీ కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి బైలుప్పల షఫీవుల్లా, బీసీ సంఘం జాతీయ నాయకుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, రెండో బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఆంధ్రప్రదేశ్ రజక రాష్ట్ర కార్పొరేషన్ అధ్యక్షురాలు సావిత్రమ్మ, సభ్యులు సయ్యద్ రోషన్ అలీ, సీబీ అజయ్ కుమార్, మనోహర్ బాబు, అరుణ కుమారి, వీవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీసీ కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కళాకారులు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కల్లూరు: ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర అధ్యక్షుడు వామనగిరి హనుమన్న, జిల్లా అధ్యక్షుడు నేనావత్ రామునాయక్ డిమాండ్ చేశారు. శనివారం మాధవి నగర్‌లో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని కలిసి వినతిపత్రమిచ్చారు. కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు రాజన్న, మహిళ కార్యదర్శులు రామేశ్వరి, హేమావతి పాల్గొన్నారు.

రేపు మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

కర్నూలు(సెంట్రల్): మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24వ తేదీన మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం నగరంలోని 9 డివిజన్ల కార్మికులతో ఆయన సమావేశమై ధర్నా విజయవంతంపై చర్చించారు. అన్ని డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు ధర్నాకు తరలి వచ్చేలా చూడాలని కోరారు. కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు.

నేటి నుంచి శ్రీశైలంలో అన్నదానం

కర్నూలు (అర్బన్): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అఖిల భారత కురువంశ నిత్యాన్నదాన సత్రం ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 27వ తేది వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సత్రం కమిటీ అధ్యక్షుడు ఎంకే రంగస్వామి, సభ్యులు గుడిసె శివన్న, పి. శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో సత్రంలో ఉదయం టిఫిన్‌తో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజనాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చే కురువ కులస్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.